

తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కుకు కాకినాడలో ఘన స్వాగతం లభించింది. ఒక వివాహ కార్యక్రమం నిమిత్తం ఆయన సోమవారం రాత్రి కాకినాడ వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొంతసేపు స్థానిక రాజకీయ పరిస్థితులపై వారు మాట్లాడుకున్నారు. అనంతరం ఎస్ఆర్ఎంటి ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకలో పాల్గొన్నారు.



బట్టి విక్రమార్క్‌కు స్వాగతం పలికిన పినిపే

ప్రయాణ కష్టాలు..

- ఆటోల్లో అదనపు ఛార్జీల వడ్డన
- సామర్లకోట-ఉప్పాడ మధ్య ఆర్‌టిసి సర్వీసులు వేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. సామర్లకోట నుంచి ఉప్పాడ చేరుకోవాలంటే ప్రయాణికుల కష్టాలు వర్ణాతీతం. ఉప్పాడ నుంచి సామర్లకోటకు ఆర్‌టిసి సేవలు లేకపోవడంతో ప్రయాణికుల ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర ప్రయివేటు వాహనాలనే ఆశ్రయించాల్సివస్తోంది. ఇదే అదునుగా ఆటోలు, ఇతర ప్రయివేటు వాహనాలు ప్రయాణికుల అవసరతను బట్టి అదనపు ఛార్జీలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే వాదన ప్రయాణికుల నుంచి విన్పిస్తోంది. సాధారణ రోజుల్లోనే పరిస్థితి ఇలావుంటే..పండుగ వేళ ప్రయాణికుల కష్టాలకు అన్నీ ఇన్నీ కావు.

సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికుల కష్టాలు వర్ణాతీతం. తమ గమ్యస్థానం చేరుకునేందుకు వివిధ వాహనాల్లో ప్రాణాలకు తెగించి మరీ ప్రయాణాలు సాగిస్తున్నారు కొంతమంది ఆటోలో ఎక్కలేక కుటుంబ సభ్యులతో ద్విచక్ర వాహనాల్లో అధిక సంఖ్యలో ప్రయాణం సాగిస్తూ ప్రమాదాలు బారిన పడుతున్నారు కొత్తపల్లి మండలానికి ఆర్‌టిసి సేవల సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఆటోల పై ఆధారపడి ప్రయాణాలు సాగించవలసి వస్తుంది. ఇదే అదునుగా పండగ సీజన్ కావడంతో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. అదిరి పేట నుంచి కాకినాడకు రెండు ఆర్‌టిసి బస్సులు తిరుగుతున్న ప్రయాణికులు అధికం కావడంతో వేలాడుతూ ప్రయాణించవలసి వస్తుంది. ఏ మాత్రం ఆదమరిసిన ప్రాణాల పోయే ప్రమాదం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.ఉప్పాడ నుంచి పిఠాపురం వెళ్లాలంటే ఆటోలలో ప్రయాణించవలసిందే. ఆటోవాలాలు అధికంగా ప్రయాణికుల్ని ఎక్కించుకుని గమ్యస్థానాన్ని చేరుస్తున్నారు. అయితే ఏమాత్రం ప్రమాదం చోటు చేసుకున్న గాయాల పాలు కాక తప్పదనే ఆందోళనలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు ఇక్కడ నెలకున్నాయి. గత ఏడాదిలో సుమారు ఆరు ప్రమాదాలు సంభవించి పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయాలపాలయ్యారు. సంక్రాంతి సెలవులకు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ట్రైన్ ద్వారా చేరుకుంటారు. పిఠాపురంలో రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ అక్కడ కొన్ని రైళ్లకు మాత్రమే ఆల్ట్ ఉంది. దీంతో అధికశాతం ప్రయాణికులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు వెళ్లడం సహజం. ఉప్పాడ నుంచి సామర్లకోట వరకు ఆటోలపై అధిక సొమ్ములు వెచ్చించి ప్రయాణిస్తున్నారు. ఉప్పాడ వయా పిఠాపురం సామర్లకోట వరకు ఆర్‌టిసి సేవలను ప్రారంభిస్తే ప్రయాణించేందుకు అణువుగా ఉంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



ఆర్‌టిసి బస్సులో ప్రయాణికుల ఇక్కట్లు



ప్రమాదకరంగా ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

రోజుకు వందలమంది ప్రయాణాలు

యు.కొత్తపల్లి మండలం నుంచి రోజూ వ్యాపారాలు, యాత్రలకు, ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు, ఇలా వందలాది మంది సామర్లకోట రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన పిఠాపురం చేరుకోవడానికి విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు వేలాదిగా నిత్యం రాకపోకలు సాగిస్తారు ఉప్పాడ నుంచి సామర్లకోటకు అప్పటి ఎంఎల్ఎ వంగా గీత సూచనలతో ఆర్‌టిసి బస్సులు నడిచేవి. తరువాత ఎందుకో ఆ సర్వీసులను ఆర్‌టిసి యాజమాన్యం నిలుపుదల చేసింది. నాటి సర్వీసులను పునరుద్ధరిస్తే మూలపేట, ఉప్పాడ, కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడి మిల్లి, కొండవరం, నాగులపల్లి, తదితర గ్రామాల ప్రజల ప్రయాణాలు సులభతరం అవుతాయి.

ప్రయివేటు వాహనాల అదనపు వసూళ్లు

మండలం నుంచి సామర్లకోటకు ఆర్‌టిసి సేవలు లేకపోవడంతో ప్రయివేటు వాహన యజమానులు ఇష్టారాజ్యంగా అదనపు ఛార్జీలను ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నారు. వాస్తవంగా ఉప్పాడ నుంచి సామర్లకోటకు ఆర్‌టిసి బస్సులో రూ.25లతో చేరుకునే అవకాశం ఉంది. అయితే ఆర్‌టిసి సర్వీసులు లేకపోవడంతో ప్రస్తుతం ఉప్పాడ నుంచి పిఠాపురంకు రూ.30, పిఠాపురం నుంచి సామర్లకోటకు రూ.30 మొత్తంగా రూ.60 వరకూ ప్రయాణికులు చెల్లించాల్సివస్తోంది. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో సామర్లకోట చేరుకోవాలంటే 80 రూపాయలు చెల్లించవలసి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌టిసి సర్వీసులను పునరుద్ధరించాలి

సామర్లకోట రైల్వే స్టేషన్ చేరుకునేందుకు వీలుగా ఉప్పాడ నుంచి సామర్లకోట వరకు ఆర్‌టిసి సర్వీసులను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా సెలవులు ఇవ్వడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్తున్నామని ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ఆటోలపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్‌టిసి సర్వీసులను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



నీటిపారుదల శాఖ సెక్షన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కిర్లంపూడి

సాగు చేసిన పంటలకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు కిర్లంపూడి నీటి పారుదల శాఖ సెక్షన్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. పిఠాపురం రూరల్ మండలంలోని గోకివాడ, జగపతిరాజపురం రైతులు సాగు చేసిన 200 ఎకరాలపైగా ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని పలు దఫాలుగా నీటి పారుదల శాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం కిర్లంపూడి సెక్షన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏలేరు నుంచి వచ్చే నీటిని దిగువకు విడుదల చేయాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా నీరు తక్కువగా ఉందని కుంటి సాకులు చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నారని ఈ సందర్భంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు విడుదల చేయకపోవడంతో భూములు బంజరు భూములుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నారు వేసి 35 రోజులు అయ్యిందని, నీరు లేక మడులు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి తక్షణమే నీరు విడుదల చేసి రబీ సాగును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మాసా మోషే, ఏసుబాబు, పెద్దకాపు, రామకృష్ణ తదితర రైతులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసుల దహనం

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉద్యోగులు దహనం చేశారు. స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగులు సోమవారం నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన నోటీసుల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 5న ఎస్‌పిడి కార్యాలయం ముట్టడి సందర్భంగా చర్చలకు పిలిచిన అధికారులు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని, చర్చలకు పిలిచిన అధికారులే సోమవారం తమకు నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఈ నోటీసుల ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటామని అన్నారు. ఈ తాటాకు చప్పుళ్ళకు, నోటీసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని చెప్పి నోటీసులు ఇవ్వడం జగన్ ప్రభుత్వానికే సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జెఎసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చంటి బాబు, సత్యనాగమణి, నాయకులు ఎంవి.సాయి కిరణ్, ఎ.లోవరాజు, నాయకత్వం వహించారు.



నోటీసులను దహనం చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు



అన్నవరంలో ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - అన్నవరం, పెద్దాపురం

ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నవరంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రజలకు, న్యాయవాదులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ చట్టం వల్ల జరిగే నష్టం గురించి ప్రజలు అవగాహన తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ సభ్యులు బి.మధు, జొన్నాడ రాజేష్. రాయి శ్రీను, న్యాయవాదులు బి.జాన్‌బాబు, బి.చలం పాల్గొన్నారు. పెద్దాపురంలో ఎపి భూ హక్కు చట్టాన్ని నిరసిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టుల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం(మణి) మాట్లాడుతూ ప్రజలకు అన్యాయం జరిగే ఎపి భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.సత్యనారాయణ, కె.రాయుడు, పి.విజయ్ కుమార్, ఎస్.నరసింహారావు, డివిఎస్ఎస్ రామచంద్రరావు, మడికి రాంబాబు, రాగం కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా విధిస్తే, ఉద్యోగులుగా గుర్తించినట్లే

-అంగన్‌వాడీల 24 గంటల దీక్షలో వక్తలు

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్వాడీలు సమ్మెపోరాటం 28వ రోజులు చేరుకుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24 గంటలు దీక్షలు మూడో రోజు శిబిరాన్ని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, సిఐటియు సీనియర్ నాయకులు మెడిశెట్టి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ వేతనాలు ఒకసారి మాత్రమే పెంచుతామని, రెండు మూడు సార్లు పెంచలేమని చెప్పడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2019 నుంచి ధరలు ఒకసారి మాత్రమే పెరగలేదని, జగన్మోహన్ రెడ్డి ప్రతినెలా కరెంటు ఛార్జీలు పెంచుతున్నారని, చెత్త పన్ను పేరుతో కొత్త రకాల పన్నులు వేస్తూ, కూరగాయల ధరలు, నిత్యవసరాలు ధరలు అయితే చెప్పనవసరం లేదని అలాంటప్పుడు ఒకసారి వేతనం పెంచితే ఎలా సరిపోతుందని వారు ప్రశ్నించారు. ఎస్మా ప్రయోగించి సెక్షన్ 21 ఐపిసి ప్రకారం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ బేసిక్ వేతనం తక్షణం అంగన్‌వాడీలకు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, ఉషా, సిహెచ్.రమణమ్మ, ఎస్.బుల్లెమ్మ, రాఘవ, వసంశెట్టి నాగమణి, చేసెట్టి పద్మ, వెంకటలక్ష్మి, సిహెచ్.రత్నమాల, దుర్గా, నాగలక్ష్మి, గౌరీ, ప్రజావాణి, భవాని, ఎస్.దివ్య, పద్మ, డి.దుర్గా, వీరలక్ష్మి పాల్గొన్నారు. శిబిరానికి అర్బన్ హెల్త్ సెంటర్స్ యూనియన్ నాయకులు కెపి.నాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గంగ సూరిబాబు, ఎపిఎస్ఆర్‌టిసి యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కాకినాడ డిపో అధ్యక్షులు పిఎస్.రావ్, డిపో కార్యదర్శి బిఎ.రావు, సామర్లకోట అడ్వకేట్ పోడూరి భాస్కరరావు మద్దతుగా మాట్లాడారు. **కోటనందూరు** తునిలో జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరంలో జై భీమ్ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తంతటి కిరణ్ కుమార్ పాల్గొని మద్దతు తెలిపారు. న్యాయపరమైన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. సిఐటియు నాయకులు శ్రీనివాస్, వై.ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఉమా మహేశ్వరి, రమణమ్మ ఇందిరా, పద్మ, లలిత, సుజాత, షకీలా భాను, మినా కుమారి తది తరులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీ నిరసన శిబిరం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగిస్తూ విడుదల చేసిన జిఒ ప్రతులను దహనం చేశారు. తక్షణమే ఎస్మా చట్టం ప్రయోగాన్ని ఎత్తివేసి తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీడలు జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం పాల్గొన్నారు. **పెద్దాపురం** తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలిపారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరానికి టిడిపి పట్టణ అధ్యక్షుడు రంది సత్యనారాయణ, సిపెం జిల్లా నాయకులు కరణం ప్రసాదరావు, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ తుమ్మల బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. టిడిపి పట్టణం అధ్యక్షులు రంది సత్యనారాయణ,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు లు అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ప్రసంగించారు. మాజీ వైస్ ఛైర్మన్ కొరిపూరి రాజు, సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్, యూనియన్ నాయకులు దాడి బేబీ, అమల, నాగమణి, పద్మావతి పాల్గొన్నారు.



కాకినాడలో 24 గంటల దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు



తునిలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు



అంగన్‌వాడీలకు మద్దతుగా టిడిపి, జనసేన, సిపిఎం నాయకులు

అపరాధ రుసుం రూ.54 లక్షలు వసూలు

ప్రజాశక్తి - శంఖవరం

మండల పరిధి లోని కత్తిపూడి చెక్ పోస్ట్ వద్ద గత మార్చి నుంచి డిసెంబర్ వరకూ వివిధ వాహనాల నుంచి అపరాధ రుసుంగా రూ.53 లక్షలను వసూలు చేసినట్లు రవాణా శాఖ అధి కారి బి.శ్రీనివాస్ తెలిపారు. 450 కేసులు నమోదు చేశామని, వివిధ వాహనాల ద్వారా 90 శాతం వసూళ్లలక్ష్యం పూర్తయినట్లు చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రజాశక్తి మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న ఆరు మండలాల్లోనూ వాహనాల బ్రేకులు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ లేనివి, ఓవర్ లోడ్ తో వెళ్తున్న వాటిని ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టడం ద్వారా అధిక సంఖ్యలో కేసులు నమోదు చేశామన్నారు. వివిధ వాహనాల నుంచి వసూలు చేసిన రూ.54 లక్షలను ప్రభుత్వానికి జమ చేసినట్లు చెప్పారు. గతంలో నెలకు రూ.4 లక్షలు వసూలు చేయాలని లక్ష్యంగా ఉండేదని, అయితే ప్రభుత్వం ప్రస్తుతం రూ.6 లక్షల వరకూ వసూలు చేయాలని నిర్దేశించిందని తెలిపారు. దీనివల్ల మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించడం వల్ల ఇప్పటికే 90 శాతం వసూళ్లు కాగా, మిగిలిన 10 శాతాన్ని ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని శ్రీనివాస్ తెలిపారు.




వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారి శ్రీనివాస్

యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టిన జగన్

ప్రజాశక్తి - కాకినాడ

మోసపూరిత మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ నేడు రాష్ట్ర యువత బంగారు భవిష్యత్తును చీకట్లోకి నెట్టేసాడని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో నడుస్తున్నది సంక్షేమ ప్రభుత్వం కాదని సంక్షోభ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ఆనాడు జగన్ యువతకు ఇచ్చిన హామీలలో నేడు ఒకటీ కూడా నెరవేర్చలేదని, వైసిపి ప్రభుత్వం రాగానే 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని మోసం చేసి, నేడు వైన్ షాపులు, ఫిష్ మార్కెట్లు జాబులు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు. వైసిపి పాలనలో ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ గానీ, పోలీస్, గ్రూపు 1,2,3 నోటికేషన్లు గాని ఇవ్వలేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి చంద్రబాబు నాయకత్వంలో యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడవాలంటే అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, పలివెల రవి, అంబటి చిన్న, గుజ్జు బాబు, బంగారు సత్యనారాయణ, ఒమ్మి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యలో జాతీయ స్థాయి సదస్సు ప్రారంభం


ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాగణంలో గల ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఫోరెన్సిక్ వివిధ నూతన అన్వేషణ పద్ధతులు మరియు వాటి అధ్యయనం అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సు సోమవారం ప్రారంభం అయ్యింది. ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎం.నాగి రెడ్డి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఐజి అశోక్ కుమార్ మాట్లాడుతూ నేర ఆన్వేషణ లో ఫోరెన్సిక్ శాఖ, పోలీస్ శాఖ కు చాలా కీలకమైందన్నారు. అటువంటి ఫోరెన్సిక్ సైన్స్ కోర్సను ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు మన ఆంధ్ర రాష్ట్రంలో ఆదిత్య విద్యా సంస్థలో ఉండటం గర్వకారణమన్నారు. ప్రస్తుత సమాజం నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాలిసిన జాగ్రత్తలు, నేర ఆన్వేషణ ఏ విధంగా ఛేదించాలి అనే అంశాలను వివరించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ పలు యూనివర్శిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, ప్రిన్సిపల్ విలాస్ అనీల్ చవాన్, జగ్గంపేట సిఐ, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్

కార్టూ'నిజం'



మున్సిపల్ కార్యాలయాల ముట్టడి

ప్రజాశక్తి - యంత్రాంగం

మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరింది. జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం తదితర ప్రాంతాల్లో కార్మికులు తమ ఆందోళనను కొనసాగించారు. ఆయా మున్సిపల్ కార్యాలయాలను కార్మికులు ముట్టడించారు. **పిఠాపురం** గొల్లప్రోలు మండలంలోని నగర పంచాయితీ కార్యాలయాన్ని పారిశుధ్య కార్మికులు సోమవారం ముటడించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నందీశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యేసమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల మొండివైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించడంతోపాటు, 6 నెలల బకాయి జీతాలను తక్షణమే విడుదల చేయాలని, అప్పటి వరకూ సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు. ఇదే అంశంపై కమిషనర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, స్థానికంగా ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు లోవబాబు, బి.సత్యవతి, సిహెచ్.రామారావు, జి రాజులు, రాజమోహన్, రాములమ్మ, లక్ష్మి, పార్వతి, పైడిరాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. మున్సిపల్ సెం టర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులు మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలిపారు. టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ తూతిక రాజు, జన సేన నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి, పట్టణ అధ్యక్షులు పొలమర శెట్టి సత్తి బాబు, పిట్టా జానకి రామయ్య, సిపిఎం నాయకులు కరణం ప్రసాదరావు, నీలపాల సూరిబాబు లు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ, తైనాల శ్రీను, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గిరిబాబు శివకోటి అప్పారావు, సింగంపల్లి సింహాచలం, ద్రౌపతి శ్రీను, వేలాపు శివభవాని, ముత్యాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదురుగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షల కొనసాగాయి. నిరాహార దీక్షలో మహిళా కార్మికులు పాల్గొన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ఎలిశెట్టి రామదాసు పాల్గొని మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు బొచ్చ శీను, కసింకోట ఆనందరావు, కసింకోట కిషోర్, కౌలు వరమ్మ, సింగంపల్లి పద్మ, బంగారు కొండమ్మ, చెన్నా నాగ మనీ ,బంగారు లావణ్య, సత్తిబాబు, ఆజారి లావరాజు, వెంకటేశు, ఎన్ని నాగేంద్ర, మిర్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో మున్సిపల్ కార్యాలయ ముట్టడిలో కార్మికులు

నేరాలు ఘోరాలు

రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

రెండు బైకులు ఢీకొని సోమవారం ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని వడ్లమూరుకు చెందిన పెండ్యాల సతీష్ (19), కె.గంగవరం మండలం ఎండగండికి చెందిన కదలి త్రిమూర్తులు (32) సోమవారం రాత్రి బైకులపై ఎదురుగా ప్రయాణిస్తూ నల్లూరు - కాలేరు రహదారి మధ్య ఢీకొన్నారు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయమైన త్రిమూర్తులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన సతీష్‌ను 108లో మండపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. త్రిమూర్తులు వివాహితుడు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు అంగర ఎస్ఐ చంటి తెలిపారు.

పిడిఎస్ రైస్ అక్రమ నిల్వలపై దాడులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరం గ్రామంలోని అక్రమ బియ్యం వ్యాపారస్తులపై విజిలెన్స్, సివిల్ సప్లయి అధికారులు సంయుక్తంగా సోమవారం దాడులు నిర్వహించారు. అప్పన వీరబాబు ఇంటిలో 25 బ్యాగ్‌లలో సుమారు 920 కెజిల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. అలాగే అట్టూరి శ్రీనివాస్ నివాసంలో 23 బ్యాగ్‌లలో సుమారు 1080 కేజిల బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ.87,400 వరకూ ఉంటుందని, సుమారు 2 వేల కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జ్ అధికారి ఎ.సురేష్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ టి.నాగ వెంకటరాజు, ఎస్ఐ జగన్నాథరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మినారాయణ, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో సారా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో మండలంలోని ఉలిమేశ్వరం గ్రామంలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ తెలిపారు. సారా కేసులకు సంబంధించి పెద్దాపురం మండల పరిధిలో 24 మందిపై, జగ్గంపేట మండల పరిధిలో 11 మందిపై, గండేపల్లి మండల పరిధిలో 8 మందిపై బైండోవర్ కేసులు పెట్టి ఆయా మండలాల తహశీల్దార్ కోర్టులలో హజరు పర్చినట్లు తెలిపారు.

భారీగా యానాం మద్యం పట్టివేత

ప్రజాశక్తి-అయినవిల్లి

యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సిఐ ప్రశాంత్ కుమార్, అయినవిల్లి ఎస్ఐ సురేష్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. యానాం నుంచి అయినవిల్లి మీదుగా గుంటూరు మద్యం తరలిస్తున్న కె.గంగవరానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ కారుతో పట్టుకున్నట్టు తెలిపారు. సుమారు రూ.లక్షా 40 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

విధి నిర్వహణలో బందోబస్తు వెళ్లిన పోలీసు సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. లొల్ల గ్రామంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మించేందుకు పనులు చేస్తున్న విషయం తెలుసుకున్న పంచాయితీ కార్యదర్శి సాయిరాం రెడ్డి పనుల నిలుపుదలకు సంబంధిత వ్యక్తులకు నోటీసు ఇచ్చారు. కానీ పనులు నిలుపుదల చేయకపోవడంతో ఆదివారం పంచాయతీ కార్యదర్శి పోలీసులతో కలిసి పనులను ఆపు చేయాలని లేని పక్షంలో తొలగిస్తామని చెప్పారు. యథావిధిగా పనులు చేయడంతో సోమవారం మధ్యాహ్నం పంచాయితీ కార్యదర్శి మరియు సిబ్బంది, పోలీసు సిబ్బందితో వెళ్లారు. కల్లూరి మణికంత, పెన్నింటి సాయి కృష్ణ అధికారులపై దాడి చేశారు. కానిస్టేబుల్ కెవివి.సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరినీ అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

సారా దాడుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

నాటుసారా విక్రయాలపై కాకినాడ డిటిఎఫ్ అధికారుల బృందం నిర్వహించిన దాడుల్లో సామర్లకోటకు చెందిన ఇద్దరు సారా వ్యాపారులను అరెస్టు చేశారు. స్థానిక సెట్టిబలిజీ పేటకు చెందిన గుబ్బల నాగమణి వద్ద 20 లీటర్లు, గుబ్బల వీర ఆదివిష్ణు వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని వారిద్దరినీ అరెస్టు చేశారు. ఇరువురిపై కేసులు నమోదు చేశామన్నారు.

10న టిడిపి సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ఈ నెల 10 న టిడిపి ఆధ్వర్యంలో తునిలో జరుగుతున్న 'రా కదలి రా' బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బహిరంగ సభను విజయవంతం చేయడానికి నాలుగు మండలాల నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రా కదలి రా ప్రోగ్రాం పరిశీలకులు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, నియోజకవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు, నాలుగు మండలాల పరిశీలకులు రెడ్డి మణేశ్వరరావు, పితాని శివరామకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, ఆళ్ళ గోవిందు, మారిశెట్టి భద్రం, ఎస్‌విఎస్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఇబి సిఐ జె.వెంకట భవాని హెచ్చరించారు. సోమవారం తహశీల్దార్ సత్యనారాయణ ఎదుట గతంలో అక్రమ మద్యం విక్రయిస్తూ పట్టుబడిన 39 మందిని హాజరపరిచారు. ఈ సందర్భంగా సిఐ భవాని మాట్లాడుతూ సంక్రాంతి పురస్కరించుకుని గ్రామాల్లో నాటు సారా విక్రయాలుగాని, అక్రమ మద్యం విక్రయాలు జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ 39 మందిపై నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. **తాళ్లరేవు** మండలంలోని పటవల, కోరంగి, చిన్న బొడ్డు వెంకటాయపాలెం, గాడిమొగ, లక్ష్మీపతిపురం, తాళ్లరేవు, పిమ్మలపరం, పిల్లంక, చొల్లంగి జడ్పి ఉన్నత పాఠశాలల్లో ట్యాబ్లు, బెస్ట్ క్లాస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సాత్విక్ సాగర్ పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, వైస్ ఎంపిపిలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత, నాగరాజు, సర్పంచులు పెయ్యల మంగేష్, కామడి గోవలక్ష్మి, చిట్టూరి నాగమణి, ముద్దన వెంకట శివరాం ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు రత్నకుమారి, పోశయ్య పాల్గొన్నారు. **కరప** స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు జడ్‌పిటిసి యార్ల సుబ్బారావు, ఎంపిపి శ్రీలక్ష్మి, ఎంఇఒ కెబి.కృష్ణవేణి పాల్గొని విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాధె ఆశాజ్యోతి, పిఎంసి చైర్మన్ రమాదేవి, హెచ్ఎం లీలా మనోహర్, స్టాఫ్ సెక్రటరీ మారిశెట్టి రమేష్, బి.స్వర్ణ రాణి, సుదర్శన్, సుధాకర్, సుబ్రహ్మణ్యం, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పిఠాపురం** మండలంలోని వన్నెపూడిలోని జడ్‌పి హైస్కూల్‌లో విద్యా కమిటీ చైర్మన్ కంటే పరిమళ అధ్యక్షతన విద్యార్థులకు ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటే వీరరాఘవరావు, వాయులేటి చిన్నారావు, ఉండముట్ల గంగాధర్, గొల్లపల్లి దొరబ్బాయి, ప్రధానోపాధ్యాయులు గిరి, సంధ్యారాణి, జానకి రమయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** రాష్ట్ర ప్రభుత్వం 10వ తరగతి విద్యార్థులకు ఇస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ సూచించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్‌లో సోమవారం స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గోవిందు, కె.అరుణ కెవివి. సత్యనారాయణ, వి.రాజు, ఎఎల్‌వి.కుమారి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. **కరప** స్థానిక గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎస్ఎంసి చైర్మన్ పబ్బినీడి వీరబాబు, ఎంపిటిసి సభ్యులు వై.వీరవేణి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ హెచ్ఎం ఎంవివి .రమణమూర్తి మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఎ.సూర్యనారాయణ, వి.శోభాకర్, టి.వేణుగోపాల్ పాల్గొన్నారు. **కాజులూరు** కాజులూరు, కుయ్యేరు జడ్‌పి ఉన్నత పాఠశాల్లో జరిగిన కార్యక్రమాల్లో జడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు పాల్గొని 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాత భారతి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కోన రాధాకృష్ణ, హెచ్ఎం పంపన కృష్ణమూర్తి, ఎంపిటిసి సభ్యులు సత్యనారాయణ, ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, పాల్గొన్నారు.



తాళ్లరేవులో స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎంపిపి సునీత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న హెచ్ఎం

యానాం వార్తలు



ముగింపు వేడుకలకు హాజరైన ప్రజలు

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పర్యాటక, రైతు సంక్షేమ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు స్థానిక బాలయోగి క్రీడా మైదానంలో నిర్వహించిన 20వ యానాం ప్రజా ఉత్సవాలు, 22వ ఫల పుష్ప ప్రదర్శన సోమవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమాలను ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు చేసిన ప్రత్యేక నృత్యాలు అందరినీ అలరించాయి. చివరి రోజైన సోమవారం ప్రముఖ సినీ గాయకులచే సినీ ఆర్కెస్ట్రా, రామూ మార్గాఢి గ్రూప్ చేసిన ప్రత్యేక కార్యక్రమం, మిమిక్రీ ప్రజలను అలరించాయి. అనంతరం యానాంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన కళాకారుల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రగాశం, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ సుబ్రహ్మణియన్ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ రఘునాయగం నేతృత్వంలో సిఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



సంక్రాంతి సంబరాల్లో రీజెన్సీ విద్యార్థులు


రీజెన్సీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యానాం

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని స్థానిక మెట్టకూరు రీజెన్సీ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రంగుల పుట్టిల్లు, తెలుగు లోగిళ్లు, ముగ్గులతో వాకిట విరసే హరివిల్లు అన్న చందంగా...విద్యార్థులు చక్కటి సాంప్రదాయ దుస్తులను ధరించి బొమ్మల కొలువులతో, రంగుల హరివిల్లులతో పాఠశాల ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చి దిద్దారు. గాలిపటాల ఎగురవేత, గొబ్బెమ్మలు, కోలాటం, హరిదాసుల వేషధారణ సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు అలరించారు. భోగి, సంక్రాంతి పండుగల సంస్కృతిని తెలియచేస్తూ పాఠశాల ఆవరణలో భోగిమంటలను వేసి.. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాలు పొంగించి పొంగలిని తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు పండగల విశిష్టత, సాంప్రదాయాలు గురించి అర్థమయ్యేలా వివరించడం కోసమే ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వం వ్యవసాయ శాఖ 22 వ ఫల పుష్ప ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో రీజెన్సీ విద్యార్థినులు కె. భవ్య సృజన మొదటి బహుమతిని, వై.సాయి శ్రావ్య, ఎమ్. సుమాంజలి, ఎ. సుస్మిత లు కన్సలేషన్ బహుమతులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ చెక్కల వీరభద్రరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు

ప్రజాశక్తి - కాకినాడ



వినతులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా

స్పందన కార్యక్రమానికి వస్తున్న అర్జీలకు సంతప్తికరమైన పరిష్కారాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 451 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జెసి ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలనన్నారు. రీ ఓపెన్ అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.శ్రీరమణి, సిఇఒ ఎ.రమణారెడ్డి, సిపిఒ పి.త్రీనాథ్, డిపిఒ కె.భారతి సౌజన్య, కాకినాడ డిఎల్‌డిఒ పి.నారాయణ మూర్తి తదితరలు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం



కిర్లంపూడిలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులు

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. **కిర్లంపూడి** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జగపతినగరంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సంకాంత్రి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత తిబీరిశెట్టి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కొల్ల సూరిబాబు, కరెస్పాండంట్ సత్య సరస్వతీ, కొల్ల రాజారావు, పద్మ, ప్రిన్సిపల్ సజ్జా మనీషాపాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలను ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడిమిశెట్టి వాసు, అలమండ వీర రాఘవరావు, ప్రిన్సిపల్ పద్మావతి, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. **గండేపల్లి** శ్రీ గీతంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈ గీతం విద్యాసంస్థల అధినేత విఎస్‌పి.చౌదరి పాల్గొని సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక హార్వెస్ట్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్లు సత్యానందరెడ్డి, సత్యమోహన్‌రెడ్డిలు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిల్ రవీంద్ర, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** స్థానిక కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహభరితంగా జరిగాయి. కోరమండల్ ఫెర్టిలైజర్స్ కర్మాగార ముఖ్య అధికారి శ్రీనివాసరావు- వెంకట దుర్గావతి దంపతులు ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం కిడ్నీ వ్యాధిగ్రస్తునికి రూ.28 వేల ఆర్థిక సాయాన్ని శ్రీనివాసరావు దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్మాగార అధికారులు పద్మనాభం, వంశీ, క్లబ్బు కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు లక్ష్మీ సజన, మోహిని కుమారి పాల్గొన్నారు.

కేంద్రం ముందు సాగిల పడుతున్న జగన్, చంద్రబాబు

ప్రజాశక్తి - కాకినాడ



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం

జైలు భయంతో కేంద్ర ప్రభుత్వం ముందు జగన్, చంద్రబాబులు సాగిల పడుతున్నారని కేంద్ర మాజీ మంత్రి జెడి.శీలం విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం భావసారూప్యత గల రాజకీయపార్టీలు, దళిత, గిరిజన, మైనార్టీ ప్రజా సంఘాలతో సమా లోచన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెయిల్ రద్దు చేస్తే మరల జైలుకు వెళ్ళే పరిస్థితి ఉండటంతో సిఎం జగన్, మళ్ళీ జైలుకు వెళ్ళాల్సివస్తుందనే భయంతో ప్రతిపక్షనేత చంద్రబాబు కేంద్రం ఎదుట సాగిలపడుతున్నారని అన్నారు. వైఎస్ఆర్ కుమార్తె వైఎస్.షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరటంతో రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం కానుందన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనల మేరకు రాష్ట్ర బాధ్యతలు షర్మిల తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజశేఖరరెడ్డి ఆశయాలను సాధించేందుకు ఆయన బిడ్డ షర్మిల కాంగ్రెసు పార్టీలోకి చేరారని తెలిపారు. బిజెపితో పొత్తు పెట్టుకునే వారికి ముప్పు తప్పదని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం హయాంలో దేశవ్యాప్తంగా 600 మంది ఎంఎల్‌ఎలను కొనుగోలు చేసి, ఆరు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను హస్తగతం చేసుకున్నారని విమర్శించారు. 25 పార్టీలను కలుపుకుని ఇండియా కూటమి ఏర్పాటు చేసి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో చిన్న చిన్న పార్టీల మద్దతుతో ఎన్నికలకు వెళతామన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలవాలని కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి చూస్తున్నాయన్నారు. దళిత క్రైస్తవులకు దళిత హోదా కాంగ్రెసు వల్లే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి



తోటలను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి - గండేపల్లి

రాబోవు సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని జగ్గంపేట సిఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. సోమవారం వారు స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో కోడిపందాలు, పేకాట వంటి జూదాలు ఆడే ప్రదేశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పెద్దలకు అవగాహన కల్పించారు. కోడిపందాలు, పేకాట వంటి జూదాలను ప్రోత్సహించవద్దని, సంప్రదాయ క్రీడలు ముగ్గుల పోటీలు, వాలీబాల్ పోటీలు, కబాడీ పోటీలు వంటివి మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర జూదాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామాజిక న్యాయం చేసేందుకు కులగణన దోహదం

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్

సమాజంలో వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం చేసేందుకు కులగణన దోహదం చేస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక యుటిఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కుల గణన- సామాజిక న్యాయం అనే అంశంపై కెఎంఎంఆర్ ప్రసాద్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1866 నుంచి 1931 వరకు బ్రిటిష్ పాలకులు దేశంలో జనాభా లెక్కలతోపాటు కుల గణన కూడా నిర్వహించారని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు నాటి జనాభా శాతం ప్రాతిపదికనే కొనసాగిస్తున్నారని తెలిపారు. 2011 జనాభా లెక్కల సమయంలోనే కులగణన జరగాలని డిమాండ్ ముందుకు వచ్చిందన్నారు. ఇటీవల బీహార్‌లో వచ్చిన కులగణన వివరాలు సామాజిక న్యాయం ఎంత దయనీయంగా ఉందో వెల్లడించిందన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలకు, సామాజిక వివక్షతకు సంబంధం ఉందన్నారు. అందుచేత సమసమాజం దిశగా భారతదేశం ముందుకు సాగాలంటే కులగణన నిర్వహించడం ద్వారా వెనుకబడిన తరగతులను అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సదస్సుకి ముందుగా రానా అయ్యూబ్ రచించిన గుజరాత్ ఫైల్స్ పరిశోధనాత్మక రచనను యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ.ప్రసాదరావు పరిచయం చేశారు. సదస్సుకి ఆర్.జయప్రకాష్ ఆహ్వానం పలుకగా, కె.నాగజ్యోతి వందన సమర్పణ చేశారు. ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

కామరాజు వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

న్యూరో ఫిజీషియన్‌గా రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ బెజవాడ కామరాజును సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో సంక్రాంతి సందర్భంగా ఆత్మీయుల కలయిక పేరుతో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ కామరాజును కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కామరాజు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అంబేద్కర్, వై.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్



ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే భారత మాతా సేవా పరిషత్ సేవా సంస్థ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నానని రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఛాంబర్ మాజీ అధ్యక్షులు గొరకపూడి చిన్నయ్య దొర అన్నారు. స్థానిక భారత మాతా సేవా పరిషత్ కార్యాలయంలో ఆయన సోమవారం పాత్రికేయులతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు సామాజిక సమీకరణలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గం నుంచి టిడిపి తరుపున తనకే టిక్కెట్టు ఇస్తారని కొంతమంది ఇచ్చిన భరోసాతో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరానని తెలిపారు. తదనంతరం జరిగిన పరిణామాల వలన జై భారత్ నేషనల్ పార్టీని స్థాపించడం జరిగిందని తెలిపారు. ఇటీవల ఆ పార్టీకి అధ్యక్షునిగా సిబిఐ మాజీ జెడి లక్ష్మి నారాయణను ప్రకటించి తాను తప్పుకోవడం జరిగిందని తెలిపారు. అదే విధంగా 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా తన భార్యను పోటీలో నిలబెట్టడం, ఎన్నికల్లో ఓటమి చెందడం జరిగిందన్నారు. ఇటీవల వివిధ పార్టీల నాయకులకు చెందిన నాయకులు తనను కలవడం, పార్టీలలోకి రావాలని ఆహ్వానించారని తెలిపారు. తాను పదవుల కోసం రాజకీయాలలోకి రాలేదని, ప్రజా సేవ కోసమే రాజకీయాలలోకి రావడం జరిగిందన్నారు. తాను ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నట్లు చెప్పారు.

వివరాలను నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - శంఖవరం

రబీ పంట కాలంలో రైతులు, కౌలు రైతుల సాగుచేస్తున్న ఈ పంటల వివరాలు నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ సిబ్బందికి సూచించారు. సోమవారం కొంతంగిలో ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులు సాగు చేస్తున్న వరి, అపరాల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రిజిష్టర్లను పరిశీలించి సూచనలు ఇచ్చారు. సిబ్బంది తరుణ్, రైతులు పాల్గొన్నారు.

వైసిపిని అధికారంలోకి తీసుకొద్దాం



నాయకులను కలుసుకున్న వరుపుల సుబ్బారావు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాబోయే ఎన్నికల్లో తిరిగి వైసిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. కో-ఆర్డినేటర్‌గా నియమితులైన ఆయన సోమవారం నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, కౌన్సిలర్ సుంకర రాంబాబు తదితరుల స్వగృహాలకు వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిందని, రాబోయే ఎన్నికల్లో వైసిపిని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి అలమండ చలమయ్య, పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబు, కడిమిశెట్టి వాసు, కాకాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాళ్ళరేవు

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం కాకినాడ జిల్లా క్యాలెండర్‌ను ముమ్మిడివరం ఏఎంసీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, భూ యజమాని సంబంధం లేకుండా కౌలు రైతుకే ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని కౌలు రైతులు కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజు బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, విశ్వజన కళామండలి నాయకులు వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబు రావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పాలెపు ఈశ్వరరావు, చల్ల సంతోష్ కుమార్, కెవిపిఎస్ నాయకులు విప్పర్తి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పితాని సత్యనారాయణ, పంపన రామనారాయణ, పంపన చంద్రరావు పాల్గొన్నారు.